# లాటరీ టికెట్

**-యస్. శివానంద్**

రంగనాధం చేతిలో దినపత్రిక ఉంది. ఆత్రుతగా పేపర్ చూస్తు న్నాడు. ఒక్కసారిగా అతని మొహంలో నిరుత్సాహం చోటు చేసు కుంది.

ఆఫీసు స్టాఫంతా రంగనాధాన్నే గమనిస్తున్నారు.

ఆశగా మళ్లీ పేపర్‌లోకి తొంగి చూసాడు రంగనాధం. చూసిన చోటే పదేపదే చూస్తున్నాడు. నిరుత్సాహంగా పేపర్ మడిచి టేబుల్‌పై పడేసాడు.

''ఏమీ తగల్లేదా రంగనాధంగారూ!'' అడిగింది అతని పక్క సీట్‌లోనే వుండే టైపిస్టు రోజా.

''ఊహూ...'' నిరాశగా బదులిచ్చాడు రంగనాధం.

''ఎంత ఆశగా, ఆత్రంగా చూస్తే మాత్రం లేని నెంబర్లు పేపర్‌లో కనిపిస్తాయా? అలా కనిపించడానికి ఇది విఠలాచార్య సినిమా కాదుగా. జీవితం'' అన్నాడు అదే ఆఫీసులో పని చేస్తున్న రాజారావు హేళనగా.

''ఈసారైనా అదృష్టం కలిసొస్తే కూతురి పెళ్లి బ్రహ్మాండంగా చేయవచ్చుననుకున్నాను'' నిరాశగా అన్నాడు రంగనాధం.

''అయినా మీ పిచ్చిగానీ ఈ లాటరీ టిక్కెట్లకు ఖర్చు పెట్టే డబ్బు కూడబెడితే ఈపాటికి ఇద్దరి కూతుళ్ల పెళ్లిళ్లు చేసేవారు'' అన్నాడు రాజారావు.

రంగనాధం కలెక్టరేట్‌లో లాండ్ రికార్డ్ సెక్షన్‌లో పని చేస్తున్నాడు. ఆయనకు లాటరీ టిక్కెట్ల పిచ్చి. ఒక్కసారిగా లక్షాధికారి అయిపోవాలనే ఆశ. అందుకే ఒకటి కాదు, రెండు కాదు, ప్రతి కంపెనీవాళ్లు విడుదల చేసే లాటరీ టిక్కెట్లను బోలెడు కొంటాడు. ఆయనకు పెళ్లికెదిగిన ఇద్దరు కూతుళ్లు. మరో కూతురికి రేపోమాపో పెద్దమనిషి అయ్యే వయసొచ్చింది. ఇద్దరు స్కూల్లో చదువుకుంటున్న కొడుకులు. వీరందరి బరువు బాధ్యతలు, పెళ్లిళ్లు, పేరంటాలు... ఇవన్నీ చేయడానికి ఆయనకి తాతలు, తండ్రులు సంపాదించిన ఆస్తిపాస్తులేం లేవు. ఒక్క ఇల్లు తప్ప. పిల్లల చదువులకు, ఇంటి ఖర్చులకే జీతం డబ్బు చాలీ చాలకుండా వుంది. ఈ రోజుల్లో ఆడపిల్లల పెళ్లిళ్లు చేయడం రంగనాధంకు తలకు మించిన భారం అయింది. అందుకే లాటరీ టికెట్లు కొంటూ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు.

''సగం జీతం లాటరీ టిక్కెట్లకే తగలేస్తున్నారు'' అని అతని భార్య నెత్తీ నోరూ బాదుకున్నా వినకుండా ఎప్పటికైనా అదృష్టలక్ష్మీ కరుణించి తనను లక్షాధికారిని చేయదా అనే ఆశతో కాలం గడుపుతున్నాడు రంగనాధం.

ఆఫీసు టైం అయిపోగానే తిన్నగా ఇంటిదారి పట్టాడు రంగనాధం.

''ఈసారి కూడా నెంబర్ తగల్లేదా?'' ముఖం చూడగానే గుర్తు పట్టినట్టుంది అతని భార్య రాధమ్మ. అందుకే గుమ్మంలో అడుగుపెట్టగానే అడిగేసింది.

రంగనాధం కిమ్మనకుండా ముఖం కిందకి దించుకు న్నాడు.

''పాలవాడికీ, కూరగాయలవాడికి ఈ రోజు ఎల్లాగైనా డబ్బులు ఇస్తానని చెప్పాను. సాయంత్రం వస్తామన్నారు. వాళ్లకేం సమాధానం చెప్పుకుంటారో చెప్పుకోండి'' అంది రాధమ్మ కోపంగా.

''రాగానే మొదలెట్టావ్ నీ పాడు సొద. కాసేపు అప్పుల వాళ్ల గురించి చెప్పకుండా కాస్త కాఫీ కలిపి నా మొహాన కొట్టొచ్చుగా'' చిరాగ్గా అన్నాడు.

''కాఫీకేం వచ్చింది లెండి. డబ్బంతా లాటరీ టిక్కెట్లకే తగలెట్టి హాయిగా కాలుమీద కాలేసుకుని కాఫీలు, హార్లిక్స్‌లు కావాలంటారు. ఇంట్లో పెళ్లీడుకొచ్చిన అమ్మాయిలున్నారన్న సంగతి మీకు గుర్తుంటేకదా!''

''నాకు మాత్రం అమ్మాయిల పెళ్లిళ్లు చేసే ఆలోచన లేదటే! కొద్దోగొప్పో లాటరీలో కలిసొస్తే పెళ్లిళ్లు ఘనంగా చెయ్యవచ్చుననుకున్నాను. ఈసారి కూడా ఆ భగవంతుడికి మనమీద దయ కలగలేదు'' నిట్టూర్చాడు.

రంగనాధం పెద్దమ్మాయి సీత డిగ్రీ చదువుకుంది. రెండో అమ్మాయి గీత ఇంటర్, మూడవ అమ్మాయి సునీత పదవ తరగతి చదువుతున్నారు. వాళ్లు పెద్దవాళ్లు కాబట్టి ఇంట్లో ఎప్పుడూ ఏ గొడవ జరిగినా అంతగా పట్టించుకోరు. తమ తల్లిదండ్రుల వాదోపవాదాలు వాళ్లకు మామూలు విషయాల్లాగే అయిపోయాయి. కానీ ఐదో క్లాసు చదువుతున్న రాజు, రెండో క్లాసు చదువుతున్న శేఖర్ చిన్నపిల్లలు కావడంవలన చదువుతున్న పుస్తకాలు పక్కనపడేసి తల్లిదండ్రులు గొడవ పడడాన్ని తలుపు చాటునుండి వినోదంలా చూస్తున్నారు.

కాఫీ భర్తకిస్తూ ''చిన్నోడు శేఖర్ మొక్కు విషయం ఏం ఆలోచించారు?'' నెమ్మదిగానే అడిగింది.

''ఆ విషయం ప్రతి క్షణం ఆలోచిస్తూనే ఉన్నాను'' అన్నాడు రంగనాధం.

''ఆలోచిస్తూ కూర్చుంటే ఎలాగండీ! ఇప్పటికే రెండేళ్లు గడిచిపోయాయి. ఆలస్యం చేస్తే స్వామివారికి కోపం వస్తుందేమో! మళ్లీ తన మాయలు చూపించినా చూపిస్తాడు'' ఆమె మాటల్లో భయం, దిగులు చోటు చేసుకున్నాయి.

రంగనాధం ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు.

రెండేళ్లక్రితం రంగనాధం చిన్నకొడుకు శేఖర్‌కు జ్వరం వచ్చి మాట కూడా లేకుండా పడిపోయాడు. అప్పుడు ఎన్ని రకాల వైద్యం చేయించినా నయం కాకపోతే వెయ్యి నూటపదహార్లు హుండీలో వేస్తామని వేంకటేశ్వరస్వామికి మొక్కుకుంది రాధమ్మ. ఆ పరిస్థితిలో కొడుకును దక్కించుకోవాలన్న తపనతప్ప మరే విషయం ఆలోచించలేదు. అంత డబ్బు హుండీలో వేసే స్తోమత తన భర్తకు లేదన్న ఆలోచన కూడా ఆ సమయంలో ఆమెకు రాలేదు. మొక్కుకున్న తర్వాత క్రమంగా శేఖర్ కోలుకున్నాడు.

''మాట్లాడరేమిటండీ. ఈనెలలో ఎల్లాగైనాసరే తిరుపతి వెళ్లి మొక్కు తీర్చిరండి.''

''నువ్వు వెళ్లమనగానే వెళ్లడం సాధ్యమా చెప్పు. రైలు ఖర్చులుపోను వంద రూపాయలైనా చేతిలో వుండాలి. పైగా హుండీలో వేయడానికి వెయ్యినూట పదహార్లు ఎక్కడ నుండి తేను?''

''ఎవరినైనా అప్పు అడగండి.''

''ఎవరినడగాలి? ఊరంతా అప్పులే. అడగడానికి ఇంకా ఎవరూ మిగల్లేదు.''

''మన వీధిలో ఉండే సుబ్బారావుగారిని అడగండి. ఆయన చాలా మంచివారు. మన పరిస్థితి చెబితే ఇస్తారేమో! ప్రయత్నించండి'' సలహా ఇచ్చింది రాధమ్మ.

సుబ్బారావు అనగానే రంగనాధంకు కాస్త ధైర్యం వచ్చింది. సుబ్బారావు తనకు బాగా పరిచయం. ఎప్పుడూ ఆయన్ని అప్పు అడగలేదు. పైగా ఆయనకు ఒక విషయంలో సహాయం కూడా చేసాడు. సుబ్బారావును అప్పు అడిగితే కాదనడనే నమ్మకం ఉంది తనకు. ఇక ఆలస్యం చేయకుండా సుబ్బారావు ఇంటికి బయలుదేరాడు రంగనాధం.

★★★

సుబ్బారావు ఇంటిముందు ఆగాడు రంగనాధం.

లంకంత ఇంటిని చూసి లోపలకు వెళ్లాలా వద్దా అని సందేహిస్తున్నాడు. ఆ ఇంట్లోవున్న కుక్క రంగనాధాన్ని చూసి మొరిగింది. ఆ కుక్క ఎత్తుగా, బలిష్టంగా ఉంది. అదిగాని పైన పడిందా ఏ పార్టుకాపార్టు పీకి పారేస్తుందేమో! భయంగా ఒక అడుగు వెనక్కువేశాడు రంగనాధం.

అప్పుడే లోపల్నుంచి వచ్చిన సుబ్బారావు రంగనాధాన్ని చూసి ''ఏమిటండీ రంగనాధంగారూ! ఇలా వచ్చారు?'' అడిగాడు.

రంగనాధం ఎలా మొదలుపెట్టాలో తెలియక సతమతమవుతున్నాడు.

''అయినా సమయానికే వచ్చారు. ఈ రోజు చదరంగం ఆడడానికి సత్తిబాబు రాలేదు. బోర్‌గా వుంది. రండి రెండాటలు వేద్దాం.''

''నేను...మీతో కాస్త పనుండి వచ్చాను...'' నసుగుతూ

అన్నాడు.

''నాతో ఏం పనండీ? రండి లోపలకువెళ్లి మాట్లాడుకుందాం'' అంటూ లోపలికి నడిచాడు సుబ్బారావు. ఆయనను అనుసరించాడు రంగనాధం.

''కూర్చోండి. నిదానంగా చదరంగం ఆడుకుంటూ మాట్లాడుకుందాం'' అన్నాడు సుబ్బారావు చదరంగం పావులను పేరుస్తూ.

''తిరుపతి వెళ్లాలి మొక్కు తీర్చుకోవడానికి. ఓ రెండువేలు అప్పు కావాలి.''

''అప్పా? నేనా? మీకా? రెండువేలా?'' ఒత్తి పలికాడు.

''త్వరలోనే మీ బాకీ తీరుస్తాను.''

''అదే ఎలా తీరుస్తారు అని. మీ జీతం లాటరీ టికెట్‌లకు పోను మీ కుటుంబం గడవడానికే సరిపోవడంలేదు. నా అప్పు ఎలా తీరుస్తారు?''

''ఇల్లు అమ్మయినా సరే మీ అప్పు తీరుస్తాను!'' అర్థిస్తున్నట్లుగా అడిగాడు.

''అలా అనకండి రంగనాధంగారూ! ఊరికే అలా అన్నాను. మీ నిజాయితీ గురించి నాకు తెలుసు. మా భూముల సమస్యతో మీ ఆఫీసుకు వచ్చినప్పుడు మీరు నాకు బాగా సహకరించారు. నా పనులన్నీ చేసి పెట్టారు. నేను డబ్బు ఇవ్వబోతే కూడా మీరు తీసుకోలేదు. ఇన్నేళ్లుగా చూస్తున్నాను మీ గురించి నాకు తెలియదా?'' అంటూ లోపలికి వెళ్లి డబ్బు తీసుకువచ్చి రంగనాధంకు ఇచ్చాడు సుబ్బారావు.



''చాలా థాంక్సండీ. సమయానికి ఆదుకున్నారు.''

''ఫర్వాలేదు. కానీ నాదో సలహా. చెబుతున్నానని ఏమీ అనుకోవద్దు. మీరు లాటరీ వ్యసనాన్ని మానేస్తే మంచిది. లాటరీలో డబ్బు రావడం అనేది అంతా దగా, మోసం. మీలాంటి వాళ్లెందరో లాటరీని నమ్ముకుని సర్వనాశనం అయిపోయారు. నిజాయితీగల మీరు కూడా ఈ వ్యసనానికి బానిస కావడం మంచిదికాదు. లాటరీలకు ఖర్చుపెట్టే డబ్బు సేవింగ్ చేసుకోండి. అప్పుడు మీకు అప్పుల బాధ వుండదు.''

''అలాగేనండీ'' అంటూ వెళ్ళబోయాడు.

''వెంటనే నా అప్పు తీర్చాలని మరొకరి దగ్గర అప్పు చేయకండి. నిదానంగా ఇచ్చినా ఫర్వాలేదు'' అన్నాడు సుబ్బారావు.

'ఈ రోజుల్లో సుబ్బారావులాంటి మంచి మనుషులు వుండడం చాలా అరుదు' అనుకుంటూ మరోసారి కృతజ్ఞతలు చెప్పుకుని సుబ్బారావు చెప్పిన విషయాన్నే ఆలోచిస్తూ వెళ్లిపోయాడు రంగనాధం.

★★★

అప్పుల వాళ్లంతా కట్టకట్టుకుని రంగనాధం ఇంటికి వచ్చారు. అందరూ కలసి గొడవ చేశారు. వెంటనే అప్పు తీర్చమని గట్టిగా అడిగారు. ఇల్లు వేలం వేస్తామని హెచ్చరించారు. రంగనాధం ఎంత బతిమాలినా వినిపించుకోలేదు వాళ్లు. అప్పు తీర్చమని బలవంతం చేశారు.

''ఈ ఇల్లు అమ్మి మీ బాకీలన్నీ తీరుస్తాను. కానీ ఉన్న ఫళంగా అమ్మితే అనుకున్న రేటు రాదు. కాస్త గడువు ఇవ్వండి'' బతిమాలుతున్నాడు రంగనాధం.


''సరే! రెండు మూడు నెలలు టైమ్ ఇస్తున్నాం. ఈలోపు ఇల్లు అమ్మి అప్పు తీర్చకపోతే పోలీసులకు రిపోర్టు చేస్తాం. ఆ తర్వాత నీ ఇష్టం'' అంటూ హెచ్చరించి వెళ్లిపోయారు అప్పులవాళ్లు.


ఆ గొడవంతా చూసిన రాధమ్మ అవమానంతో కుమిలిపోయింది. దుఃఖం ఆగలేదు. కొంగు నోటికి అడ్డు పెట్టుకుని గదిలోకి వెళ్లిపోయింది.

రాధమ్మ దుఃఖం మరింత ఎక్కువయింది. భోరున ఏడుస్తూ బయటకు వచ్చింది.

''ఏవండీ! అంతా అయిపోయిందండీ! ఇంకా మనం తలెత్తుకుని బతకలేమండీ'' అంటూ ఏడుస్తూ రంగనాధం గుండెలమీద వాలిపోయింది రాధమ్మ.

''ఏం జరిగింది? ఏం జరిగిందే? ఎందుకలా ఏడుస్తు




న్నావు? చెప్పు'' అంటూ రాధమ్మ భుజాలు పట్టుకుని అడిగాడు రంగనాధం కంగారుగా.

''ఆ గదిలో ఈ ఉత్తరం దొరికింది'' అంటూ చేతిలో వున్న కాగితాన్ని భర్తకు ఇచ్చింది.

రంగనాధం గుండె దడ పెరిగిపోయింది. కంగారుగా ఉత్తరం చదవడం ప్రారంభించాడు.

'నాన్నగారికి నమస్కారం.

లాటరీ వ్యసనంతో అప్పుల పాలయిన మీరు మా పెళ్లిళ్లు ఎలాగూ చేయలేరు. ఈ ఇంట్లో వుంటూ కష్టాలు అనుభవించడంకన్నా మా దారి మేము చూసుకోవడం మంచిదనిపించింది. అందుకే మాకు నచ్చిన అబ్బాయిలతో మేం వెళ్లిపోతున్నాం. మీరు మా గురించి ఆలోచించవలసిన అవసరంలేదు.

ఇట్లు
మీ కూతుళ్లు
సీత, గీత'

ఉత్తరం చదివిన రంగనాధం కుప్పలా కూలిపోయాడు. ఉత్తరం చేతిలోంచి జారిపడిపోయింది. ఆ ఉత్తరం తన చేతగానితనాన్ని వెక్కిరిస్తున్నట్టుగా కనిపించింది.

దఢాలున ఏదో శబ్దం కావడంతో ఉలిక్కిపడి చూసాడు రంగనాధం. అక్కడ రాధమ్మలేదు. లోపల తను ఏ అఘాయిత్యం చేసుకుంటుందో ఏమో?

''రాధా...రాధా... తలుపు తెరువు. నా మాట విను'' అంటూ దబదబా తలుపులను బాదాడు. ఏం చేయాలో అర్థంకాక తలుపులను గట్టిగా తన్నాడు. అప్పటికే పాడయిపోయి వున్న తలుపులు రంగనాధం తన్నిన తన్నుకు తెరుచుకున్నాయి.

లోపలి దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడయిపోయాడు రంగనాధం.

లోపల ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతున్న తన భార్య శవం కనిపించింది.

రంగనాధం ''రాధా...'' అని గట్టిగా అరుస్తూ దిగ్గున లేచి కూర్చున్నాడు.

ఆ అరుపుకి రాధమ్మతోపాటు నిద్రపోతున్న పిల్లలు కూడా లేచారు.

''ఏం జరిగిందండీ... ఎందుకలా అరిచారు?'' రంగనాధం నుదుటిన పట్టిన చెమటను కొంగుతో తుడుస్తూ అడిగింది రాధమ్మ.

రంగనాధం ఏమీ మాట్లాడలేదు. చమటతో అతని ఒళ్లంతా తడిసిపోయింది. తన కూతుళ్లను, భార్యను చూసేసరికి అతని మనసు కుదుటబడింది.

''పీడకల వచ్చిందా?'' కలవరపాటుతో అడిగింది రాధమ్మ.

''అవును...'' తడబడ్డాడు.

''వెంకటేశ్వరస్వామిని తలచుకుని పడుకోండి. ఉదయమే తిరుపతికి ప్రయాణమవుతున్నారు. ఏం భయం లేదు. హాయిగా పడుకోండి'' ధైర్యం చెప్పి పడుకుంది రాధమ్మ.

పిల్లలెవరికీ ఏమీ అర్థంకాక మళ్లీ నిద్రలోకి జారుకున్నారు.

రంగనాధానికి మాత్రం నిద్రపట్టలేదు. అది మామూలు కల కాదు. అందుకే అతని మనసంతా ఏదోలా వుంది. అతని కళ్లల్లో లాటరీ టిక్కెట్‌లు ఇప్పుడు రాక్షసుల్లా కనిపిస్తున్నాయి. తనకు అప్పు ఇస్తూ లాటరీల గురించి సుబ్బారావు చెప్పిన మాటలు పదేపదే గుర్తుకొస్తున్నాయి. అతను చెప్పినదాంట్లో తప్పేమీ లేదనిపించింది. లాటరీలకు ఖర్చుపెట్టే డబ్బును పొదుపు చేసుకుంటే బాగుంటుందని ఓ నిర్ణయానికి వచ్చాడు. ఉదయం వెళ్లబోయే తిరుపతి ప్రయాణం గురించి ఆలోచించాడు. తిరుపతిలో తన వ్యసనాన్ని వదిలిపెట్టాలని నిశ్చయించుకున్నాడు.

★★★

''రంగనాధంగారిలో ఎంత మార్పు వచ్చిందో మీరెప్పుడైనా గమనించారా?'' అడిగింది టైపిస్టు రోజా.

''అవును. లాటరీ టికెట్‌లు కొనడం మానేసాడుకదా! తిరుపతి వెళ్లినప్పుడు తన వ్యసనాన్ని అక్కడ వదిలిపెట్టి వచ్చాడట'' అన్నాడు రాజారావు.

''అంతేకాదండీ! లాటరీలకు ఖర్చు పెట్టకుండా ఆ డబ్బును చిట్‌ఫండ్ కంపెనీలో కడుతున్నాడు. చిట్టీద్వారా తీసుకున్న డబ్బుతో అప్పులన్నీ తీర్చడమే కాకుండా తన కూతుళ్లిద్దరికీ ఒకేసారి పెళ్లిళ్లు చేస్తున్నాడు'' చెప్పాడు క్లర్కు లక్ష్మణరావు.

''మొత్తానికి రంగనాధంగారిలో మార్పు అందరికీ సంతోషదాయకమే'' అంది రోజా.


''అవును. రంగనాధంగారు ఈ రోజు ఆఫీసుకు రాలేదేంటి?'' అడిగాడు రాజారావు.

''సెలవు పెట్టారు. పెళ్లి వారం రోజులేగా వుంది. పనులన్నీ చూసుకోవద్దూ'' చెప్పాడు లక్ష్మణరావు.

అంతలో రంగనాధం వచ్చాడు. ఆఫీసులో అందరికీ శుభలేఖలు ఇచ్చాడు. ''పెళ్లికి అందరూ రావాలి'' అని అందరినీ పేరుపేరునా ఆహ్వానించాడు.

★

## కెరీర్‌లో మలుపు!



ఐశ్వర్యారాయ్ సినీ కెరీర్‌ని 'తాళ్' చిత్రం గొప్ప మలుపు తిప్పవచ్చునని అంటున్నారు బాలీవుడ్ జనాలు. ఇంతదాకా ఆమెకంటూ ప్రత్యేకమైన హిట్ చిత్రం ఒక్కటీ లేదు. కానీ 'తాళ్' మాత్రం ఆమెని హీరోయిన్‌గా ప్రూవ్ చేయిస్తుంది అంటున్నాడు ఆ చిత్ర నిర్మాత దర్శకుడు సుభాష్ ఘయ్. డాన్సుల్లో ఒకప్పుడు వైజయంతీమాలను, నిన్నమొన్నటి వరకూ శ్రీదేవి, మాధురీ దీక్షిత్‌లను మనం గొప్పగా చెప్పుకునే వాళ్లం. అయితే 'తాళ్' చిత్రంలో ఐశ్వర్యారాయ్ నృత్య ప్రతిభ చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోతారు. అంతగా కష్టపడి చేసిందామె అని చెబుతున్నాడు సుభాష్ ఘయ్. ఐశ్వర్యారాయ్ కూడా ఈ సినిమామీద ఎంతగానో ఆశల్ని పెంచుకుని ఎదురు చూస్తోంది. ఎన్నాళ్లని అదృష్టం మీదే అవకాశాలు వస్తాయి. కాస్త హిట్లు కూడా వుండాలిగా! మరి ఐశ్వర్య కెరీర్‌ని మలుపు తిప్పే మంచి రోజులు అతి దగ్గరలోనే వున్నాయన్న మాట.

-జె.ఎం.